క్లుప్తంగా

94 సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లు అందుకొన్న వారితో సీపీ

సిద్దిపేటకమాన్: వివిధ ప్రాంతాల్లో పలువురు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను నూతన టెక్నాలజీ సాయంతో గుర్తించి బాధితులకు అందజేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ పోలీసులు నూతన టెక్నాలజీ ద్వారా 94 సెల్‌ఫోన్‌లను గుర్తించి బాధితులకు అందజేశామన్నారు. ఫోన్‌ల రికవరీలో ప్రతిభ కనబర్చిన సిబ్బంది అనిల్, సౌందర్య, లక్ష్మి, రవిని అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చడానికే చలివేంద్రాలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయ కుడు కమలాకర్‌రెడ్డి అన్నారు. నైపుణ్య ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అను మినరల్ వాటర్ సహకారంతో గాంధీచౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న క్రమంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నైపుణ్య ఆర్గనైజేషన్ చైర్మన్ ఐలయ్య, మల్లేశం, బాల్‌రాజు, బాల్ నర్సింహులు, కిష్టయ్య, రమేశ్, భైరయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే నైపుణ్య ఆర్గనైజేషన్, యూత్ ఆధ్వర్యంలో ఒకటిన రక్తదాన శిబిరం నిర్వహిస్తామని యూత్ అధ్యక్షుడు పసులకాడి రమేశ్ తెలిపారు. విజయ్, విష్ణు, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ రవికాంత్‌రావు

తొగుట(దుబ్బాక): ఆన్‌లైన్ గేమ్స్, క్రికెట్ బెట్టింగ్‌ల బారినపడి కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని తొగుట ఎస్‌ఐ రవికాంత్‌రావు యువతకు సూచించారు. మండలంలోని తుక్కాపూర్‌లో గురువారం పోలీసులు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్టింగ్‌లలో నష్టపోయిన అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలని సూచించారు. అలాగే నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహన దారులు తప్పని సరిగా హెల్మెంట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఆత్మ కమిటీ డైరెక్టర్లు

కొండపాక(గజ్వేల్): మండలం నుంచి ఆత్మ కమిటీ డైరెక్టర్లుగా నియామకమైన పబ్బోజు వీరబ్రహ్మం, ఆకారం సరోజ, దుంపలపల్లి శ్రావణ్ గురువారం అధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు. తహసీల్దార్ దిలీప్‌నాయక్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి చెరువులకు సాగునీరు అందేలా చూస్తామన్నారు. 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందించే వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనంతుల శ్రీకృష్ణ, ఏర్పుల మల్లేశం, వడ్లకొండ రవీందర్, నర్సింగరావు, బ్రహ్మం, రాజయ్య, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

హుస్నాబాద్: పాలిసెట్‌కు సిద్ధమవుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం ఉచిత కోచింగ్ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య చెప్పారు. గురువారం ఏబీవీపీ మండలశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నవభారత్ హైస్కూల్‌లో 15న ఉచిత కోచింగ్‌ను ప్రారంభించనున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో రాకేశ్, రాజేశ్, రాజు, రాహుల్ పాల్గొన్నారు.

పొన్నవాహనంపై నృసింహుడు

- కీలకదశకు బ్రహ్మోత్సవాలు
- నేడు రథ ప్రతిష్ఠ
- రేపు విమాన రథోత్సవ ఊరేగింపు



పొన్నవాహనంపై శ్రీలక్ష్మీనృసింహస్వామి

వర్గల్(గజ్వేల్): నాచగిరి క్షేత్రం బ్రహ్మోత్సవ శోభతో అలరారుతోంది. గురువారం రాత్రి శ్రీలక్ష్మీ సమేత నృసింహస్వామి విశేష అలంకరణలో పొన్నవాహనం అధిష్ఠించి ఊరేగుతూ దర్శనమిచ్చారు. ఉదయం మూలవర్యులకు అభిషేకం, అలంకారాది నిత్యపూజలు జరిగాయి. సాయంత్రం మరుమాముల శశిధరశర్మ సంగీత విభావరి, భద్రాచలం భాగవతార్ హరికథా కాలక్షేపం, యక్షగానాది కార్యక్రమాలు భక్తులను రంజింపజేశాయి.

నేడు రథ ప్రతిష్ఠ

బ్రహ్మోత్సవాల్లో కీలకమైన రథ ప్రతిష్ఠ శుక్రవారం రాత్రి జరగనుంది. ఆలయ ప్రాంగణంలో రథప్రతిష్ఠ చేసి రుత్వికులు హోమాది పూజలు నిర్వహిస్తారు. సర్వాలంకార శోభితులైన స్వామివారు గరుడారూఢులై విమానరథం అధిష్ఠిస్తారు. శనివారం తెల్లవారుజామున దివ్య విమాన రథంపై ఊరేగుతూ దర్శనమిస్తారు. భక్తుల తాకిడికి అనుగుణంగా క్షేత్రంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు.

వంద రోజుల యాక్షన్ ప్లాన్ అవసరం

కంపోస్ట్ డెవలప్‌మెంట్ అధికారి హేమలత



కంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న హేమలత

హుస్నాబాద్: ఇంటి వద్దనే తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసేలా వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సీడీఎంఏ కార్యాలయ కంపోస్ట్ డెవలప్‌మెంట్ అధికారి హేమలత ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, వార్డు అధికారులు, మెప్మా రిసోర్స్ పర్సన్స్‌కు చెత్త విభజనపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం డీఆర్‌సీసీ, కంపోస్ట్ షెడ్లులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి వద్దనే చెత్త విభజన చేసేలా నాలుగు టీమ్‌లుగా ఏర్పడి వంద రోజుల్లో పూర్తిచేయాలన్నారు. సేంద్రియ ఎరువు తయారుచేసే విధానంపై అధికారులకు, పారిశుద్ధ్య సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, మేనేజర్ సంపత్, ఆర్‌ఐ కనకయ్య, పర్యావరణ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల నిరసన



కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచ్‌లు



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో...

కొండపాక(గజ్వేల్): ముందస్తు అరెస్టులను ఖండిస్తూ మాజీ సర్పంచ్‌లు పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలిపారు. గ్రామాభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు కోల శ్రీనివాస్, కాసపురం సంజీవరెడ్డి, కనకయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా పెండింగ్ బిల్లులపై స్పందన లేకపోవడంతో చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టారన్నారు. అప్పులు చేసి పనులు చేశామన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు.

పోలీసుల అదుపులో..

మిరుదొడ్డి(దుబ్బాక): పంచాయతీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి తరలి వెళ్లకుండా ఉండేందుకు మిరుదొడ్డి, భూంపల్లి పోలీసులు మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, జోగ్యారి బాల్‌నర్సింహులు, పిట్ల సత్యనారాయణతో పాటు పలువురిని గురువారం అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

నిర్బంధించడం దుర్మార్గం

అక్కన్నపేట(హుస్నాబాద్): అసెంబ్లీ ముట్టడికి తలపెట్టిన కార్యక్రమానికి వెళ్లనీయకుండా నిర్బంధించడం దుర్మార్గమని మాజీ సర్పంచ్‌లు మండిపడ్డారు. మాజీ సర్పంచ్‌లు జిల్లెల అశోక్‌రెడ్డి, బొమ్మగాని రాజేశం, గద్దల రమేశ్, కాశబోయిన యాదగిరి, గుడాల సంపత్‌కుమార్‌ను పోలీసులు తెల్లవారుజామున అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. వారు మాట్లాడుతూ బిల్లులు ఇవ్వని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

మద్దూరులో..

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరులో అరెస్టయిన వారిలో సుందరగిరి స్రవంతి, గంగి భాగ్యలక్ష్మి, బొల్లు కృష్ణవేణి, జీడికంటి సుదర్శన్, ఊట్ల రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చేర్యాలలో..

చేర్యాల(సిద్దిపేట): అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా పలువురు మాజీ సర్పంచ్‌లను స్థానిక పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఎల్లారెడ్డి, భిక్షపతి, దినేశ్ ఉన్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర సర్పంచ్‌ల జేఏసీ ఇచ్చిన అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో గురువారం మాజీ సర్పంచ్‌లు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అయిలయ్య మాట్లాడుతూ తమను ఇళ్ల వద్దనే అరెస్టు చేయడం తగదన్నారు. గ్రామాలలో మౌలిక వసతులు, అభివృద్ధి పనుల కోసం లక్షల రూపాయలు అప్పులు చేశామని వాపోయారు.

సిద్దిపేటఅర్బన్‌లో...

సిద్దిపేటఅర్బన్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌లు పిలుపునివ్వడంతో మండలంలోని మాజీ సర్పంచ్‌లను త్రీటౌన్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సర్పంచ్‌ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి బొల్లం రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ అప్పులు తెచ్చి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం తమను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో అంబటి భాస్కర్‌గౌడ్, ఐరేని రమేశ్, తన్నీరు శ్రీనివాస్, కొన్నె నర్సింహులు, భూసాని రాజయ్య, తదితరులు ఉన్నారు.



వడ్లను వలుస్తున్న జడ్జి ప్రియాంక

తలంబ్రాల దీక్షలో పాల్గొనడం అదృష్టం

న్యాయమూర్తి ప్రియాంక

గజ్వేల్‌రూరల్: కోటి తలంబ్రాల దీక్షలో పాల్గొనడం తమ అదృష్టమని అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక అన్నారు. భద్రాచల సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించే గోటి తలంబ్రాలను సిద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా రామకోటి రామరాజు చేపట్టిన కోటి తలంబ్రాల దీక్షలో గురువారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగస్వాములైనందుకు సంతోషంగా ఉందన్నారు.

‘సహాయనిధి‘లో కోతలు విధించొద్దు

బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



చెక్కులు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: సీఎం సహాయనిధి సాయంలో కోతలు విధించకుండా పేదల వైద్యానికి అండగా నిలవాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని 44 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం గజ్వేల్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో గరిష్ఠ సాయం అందేదని గుర్తుచేశారు. నేడు కోతలు విధించడంతో అత్యవసర పరిస్థితుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేక పేదలు ఇక్కట్లు పడుతున్నారని వాపోయారు. అలాంటి వారికి ప్రభుత్వం భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, బీఆర్‌ఎస్ నాయకులు మధు, కుమార్, కృష్ణారెడ్డి, రాజు, చందు, చంద్రశేఖర్ గుప్త, బాపురెడ్డి, అహ్మద్, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



పనులు ప్రారంభిస్తున్న సంతోష్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): పదేండ్ల పాలనలో గ్రామాల అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ ఎంతో కృషిచేశారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. మండలంలోని గాగిల్లాపూర్‌లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంజూరు చేసిన రూ.4లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లె ప్రగతితో పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొల్లు కృష్ణవేణి, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మహేశ్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఒగ్గు కళాకారుడు సారయ్యకు సన్మానం



సారయ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు రాగుల సారయ్యకు నైజీరియా గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. దీంతో గ్రామానికి చెందిన పాశికంటి లక్ష్మయ్య–రాందాసు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయనను గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పాశికంటి వెంకటరణ మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఒగ్గు కళారూపాలతో సారయ్య తన వంతు పాత్రను పోషించినట్లు గుర్తుచేశారు. ఒగ్గు కళకు సారయ్య వన్నెను తీసుకువస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్, మాజీ ఎంపీటీసీ రాపాక పుష్పబుచ్చిరెడ్డి, ఒగ్గు కళాకారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి



నియామక పత్రాలను అందజేస్తున్న శంకరాచారి

హుస్నాబాద్‌రూరల్: ప్రజల సమస్యలపై స్పందించి వెంటనే న్యాయం చేయాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్(ఎన్‌జీఓ) జిల్లా అధ్యక్షుడు శంకరాచారి కోరారు. హుస్నాబాద్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు రాజ్యాంగంపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థ సేవలను విస్తరించడానికి హుస్నాబాద్ ప్రాంతం నుంచి జిల్లా కమిటీలోకి పలువురిని తీసుకున్నట్లు చెప్పారు. జిల్లా కార్యదర్శిగా రమేశ్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్‌గా జగత్‌పాల్, ఉపాధ్యక్షుడుగా రవీంద్రచారి, నియోజకవర్గ అధ్యక్షుడిగా నవీన్, కన్వీనర్‌గా సంపత్, కో కన్వీనర్‌గా హరిబాబు, కిశోర్‌ను నియమించినట్లు తెలిపారు.

బార్ అసోసియేషన్ తొలి అధ్యక్షుడిగా వీరమల్లయ్య



చేర్యాల(సిద్దిపేట): చేర్యాల బార్ అసోసియేషన్ తొలి అధ్యక్షుడిగా ఆరెళ్ల వీరమల్లయ్యగౌడ్ ఎన్నికయ్యారు. స్థానిక కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది ఆరెళ్ల వీరమల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా తాటికొండ ప్రణీత్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి భూమిగారి మనోహర్ తెలిపారు. జనవరి 11న చేర్యాలలో కోర్టు ఏర్పాటైంది. అనంతరం జరిగిన తొలి ఎన్నికలో వీరమల్లయ్య తొలి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు ప్రణీత్‌ను న్యాయవాదులు అభినందించారు.

నవోదయకు విద్యార్థి ఎంపిక



శ్రీనిధి

బెజ్జంకి(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా వర్గల్‌లోని నవోదయ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ ఫలితాలలో మండలంలోని గాగిల్లాపూర్‌కు చెందిన భూనాద్రి శ్రీనిధి ఎంపికై నట్టు కుటుంబ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని రేగులపల్లెలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శ్రీనిధి 5వ తరగతి చదువుతున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లోనూ తమ ప్రతిభను చాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ అన్నారు. ఇటీవల మెదక్ ఎంపీ రఘునందన్‌రావు జన్మదినం సందర్భంగా ఎంఆర్‌ఆర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబర్చిన బంగ్లా వెంకటాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రవళిక(ప్రథమ), శ్రీజ(ద్వితీయ)కు గురువారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల్‌రావు, ఉపాధ్యాయులు నాగరాజు, విజయ, మాధవి, బీజేపీ నాయకులు సంపత్‌రెడ్డి, శ్రీనివాస్, కుమార్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, సాయిరాం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి దివ్యాంగ సంఘం నాయకుడు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దివ్యాంగ సంఘం నాయకుడు కెమ్మసారం అశోక్, పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సిద్దిపేటలో గురువారం అశోక్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ అశోక్‌కు గతంతో కౌన్సిలర్‌గా పోటీచేసే అవకాశం ఇచ్చామన్నారు. కార్యకర్తలు నిరుత్సాహ పడకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఆ కళాశాలల గుర్తింపును రద్దుచేయండి

యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి



వినతిపత్రాన్ని చూపుతున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: తప్పుడు సమాచారం ఇచ్చే ప్రైవేటు కళాశాలల గుర్తింపును రద్దుచేసేలా యూజీసీ(యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్) చర్యలు తీసుకోవాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి డిమాండ్ చేశారు. యూజీసీ రాష్ట్ర వ్యాప్తంగా 105 కళాశాలలకు అటానమస్ ప్రకటించిందని, వాటిపై పునర్విచారణ జరపాలని కోరుతూ ఢిల్లీలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో రవి మాట్లాడుతూ అనేక కళాశాలలకు అటానమస్ గుర్తింపు ప్రకటించడం పలు అనుమానాలకు తావిస్తోందని, తక్షణమే యూజీసీ స్పందించి పునర్విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అటానమస్ గుర్తింపు పొందిన ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు అధికంగా ఫీజులను వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. కనీస వసతులు కల్పించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు. ఈ విషయంలో యూజీసీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే యూజీసీ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, గణేశ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభ చాటినప్పడే గుర్తింపు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు తమలోని ప్రతిభను చాటినపుడే గుర్తింపు లభిస్తుందని జీడీఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప, కరస్పాండెంట్ మనోజ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జీడీఆర్ పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 3న ముంబాయి ఆర్గనైజేషన్ రంగోత్సవ్ ఇంటర్నేషనల్ లెవల్ ఆర్ట్ కాంపిటీషన్ నిర్వహించారు. 69 మంది పాల్గొనగా అక్షరశ్రీ, రుత్విక్, మనోజ్, వరుణ్, నోమిక, శ్రీహన్, ప్రసన్న ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులను అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శిల్ప మాట్లాడుతూ ఇలాంటి పోటీల ద్వారా విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుకునేందుకు మంచి అవకాశం ఉంటుందన్నారు.



ముస్లింలకు స్వీట్ తినిపిస్తున్న నాయకులు

బీఎస్పీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

హుస్నాబాద్: రంజాన్ పండుగ సందర్భంగా బీఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక జామా మసీద్‌లో గురువారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల వెంకన్న ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. హిందువులు, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని కోరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్ గౌడ్, నాయకులు శంకర్, రాజు, బాబు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గజ్వేల్‌రూరల్: ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతున్న దంపతులను టాటా ఏస్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలైన ఘటన మండల పరిధిలోని రిమ్మనగూడలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్‌కు చెందిన బొప్ప బాల్‌నర్సు తన భార్య రాజవ్వ(58)తో కలిసి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై దాతర్‌పల్లి వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో రాజీవ్ రహదారిపై రిమ్మనగూడ రోడ్డు దాటుతుండగా కొడకండ్ల వైపు నుంచి ప్రజ్ఞాపూర్ వైపు వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. దీంతో రాజవ్వ అక్కడికక్కడే మృతి చెందగా, బాల్‌నర్సుకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో నడ్డి విరుస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గజ్వేల్‌రూరల్: ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ అన్నారు. గజ్వేల్‌లో నిర్వహించిన సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్‌ఆర్‌ఎస్ పేరున రూ. వెయ్యి చెల్లించగా, తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో ప్రజల నుంచి డబ్బులు దోచుకునేందుకు సిద్ధమైందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంటి అనుమతులు తీసుకున్న సమయంలోనే ఎల్‌ఆర్‌ఎస్ పేరున డబ్బులు వసూలు చేసినప్పటికీ ఇప్పుడు మరోసారి ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించాలని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎల్‌ఆర్‌ఎస్‌ను నిలిపివేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుడిక్యాల రాములు, వెంకట్‌రెడ్డి, నర్సింహ, సందీప్ కుమార్, విజయ్, కరుణాకర్, అనిల్, బాబు, నవీన్, రాజేశ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.